ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 04-01-2026 సమయం 18.10 గంటలు

1. స్త్రీ నిధి రుణాలు తీసుకుని, సకాలంలో చెల్లించని డ్వాక్రా సంఘాలపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
2. గిరిజన సంస్కృతి సంప్రదాయలకు అనుగుణంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తామని మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు.
3. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన పైఖరి అవలంభిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.
4. రాష్ట్రంలో తూర్పు, ఆగ్నేయ దిశల నుండి వీచే చలి గాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

స్త్రీ నిధి:

స్త్రీ నిధి రుణాలు తీసుకుని చెల్లించని డ్వాక్రా సంఘాలపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చట్ట ప్రకారం బకాయిలు చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసి.. బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఒకవేళ రుణం తీసుకున్న సభ్యురాలికి ఆస్తులు లేకపోయినట్లైతే రుణ చెల్లింపు బాధ్యత మొత్తం గ్రూప్ సభ్యులపై ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

డెస్క్

మేడారం

గిరిజన సంస్కృతి సంప్రదాయలకు అనుగుణంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తామని మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. ఈ రోజు మేడారం జాతర పనుల ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. జంపన్న వాగు నుంచి ప్రధాన వేదిక వరకు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. మేడారం జాతర నిర్వహణపై అధికారులతో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రులు ఆదేశించారు.

డెస్క్

హరీష్ రావు

మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధి కోసమే తమ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేవలం ఒక చిన్న కాలువ పనులు పూర్తి చేస్తే.. 50 టీఎంసీల నీటి నిల్వ చేసే అవకాశం ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా బీఆర్ఎస్ పై రాజకీయ విమర్శలు చేస్తోందని.. ఆయన అసహనం వ్యక్తం చేశారు.          బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో       11 ప్రాజెక్టులకు DPR లను కేంద్ర ప్రభుత్వానికి పంపితే, 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించామని మాజీ మంత్రి , బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క డిపిఆర్ ను పంపలేదని      ,  నీటి ప్రాజెక్టుల విషయంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు.

డెస్క్

మెట్రో రైల్

హైదరాబాద్ మహా నగరాన్ని చుట్టుముట్టేలా  ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో మహా మెట్రో రైల్ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రణాళికల రూపొందిస్తోంది.      158 కిలోమీటర్ల వలయాకారంలో మెట్రో రింగ్ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.  ORR పరిధి లోని  22 మెట్రో  inter చేంజ్ ల వద్ద మెట్రో స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు.

డెస్క్

ఇయర్ ఎండ్ 2025

దేశ అభివృద్ధి ప్రస్థానంలో 2025 సంవత్సరం ఒక మైలు రాయి. ఎన్నో కీలకమైన మార్పులు, గత సంవత్సరం చోటు చేసుకున్నాయి. కేంద్రప్రభుత్వం చేపట్టిన ప్రగతిధాయక విధానాలు దేశాన్ని సమగ్ర పురోగతి వైపు ముందుకు నడిపించాయి. సంస్కరణల సంవత్సరంగా 2025 అనే ప్రత్యేక ధారావాహికలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మకమైన నాయకుడిగా ఎలా ఆవిష్కారమయ్యారో తెలియజేసే సంఘటనలతో ఇప్పుడు ఒక నివేదిక విందాం.

ప్రపంచ వేదికపై  2025 సంవత్సరం మన దేశ ఔన్నత్యాన్ని ఆవిష్కరించింది. నిర్ణయాత్మకమైన ఆర్థిక శక్తిగా, దేశ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న

నిర్ణయాలు ఎంతగానో దోహదపడ్డాయి. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ఏ ప్రభుత్వం సుంకాలు విధించినప్పుడు దేశమే ప్రథమం అనే పైఖరిని ప్రధానమంత్రి అవలంభించారు. ఏకపక్ష వాణిజ్య ఒప్పందాలకు, బాహ్య ఒత్తిళ్లకు మనదేశం ప్రభావితం చెందదనే.. స్పష్టమైన సందేశాన్ని ప్రధానమంత్రి ఆవిష్కరించారు. జీఎస్టీ ఫ్రేమ్ వర్క్ ను బలోపేతం చేయడం, నాలుగు కార్మిక చట్టాలను అమలు చేయడం వంటి సంస్కరణల వల్ల 2025లో దేశ ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం జీడీపీ వృద్ధి రేటుకు చేరుకుంది. అలాగే పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సింధూర్ ని ప్రారంభించి జాతీయ భద్రతా విషయంలో రాజీలేని పోరాటాన్ని కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపి దేశంలో శాంతిభద్రతల విషయంలో మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అపూర్వమైన గుర్తింపు లభించింది. వివిధ దేశాల నుంచి 29 అంతర్జాతీయ గౌరవ పురస్కారాలను స్వీకరించారు. ఇండియా- యూకే, ఇండియా-ఒమన్ సమగ్ర వాణిజ్య ఒప్పందాల ద్వారా, దేశ వాణిజ్యానికి కొత్త మార్గాలను చేర్చారు. ఈ తరహా ద్వైపాక్షిక సంబంధాల ద్వారా వ్యూహాత్మక స్వేచ్ఛా వాణిజ్యం కొత్త శిఖరాలకు చేరుకుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల చట్టసభలలో మోదీ 18

ప్రసంగాలు చేశారు. ఘున, ట్రినిడాడ్, టొబాగో దేశాధినేతల నుంచి రష్యా అధ్యక్షుడు పుతిన్ వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు. ఇది మనదేశ విశ్వసనీయతకు, సమగ్రతకు , మోదీ నాయకత్వ పటిమను ఆవిష్కరిస్తుంది.

BYTE:

యంగ్ ఇండియా స్కూల్

రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల వల్ల పేద వెనకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్గడ్ మండలం కోనాయిచలం వద్ద 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు ఈనెల 10న భూమి పూజ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన విద్యాశాఖ ఉన్నతాధికారులతో, ఇంజినీరింగ్, కన్సల్టెన్సీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు.

జనగామ జిల్లా, పీటీసీ

వీబీజీ రామ్ జీ

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వీబీజీ రామ్ జీ పథకం గ్రామీణాభివృద్ధికి ఎంతో ఉపకరిస్తుందని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అన్నారు. ఈరోజు ఆకాశవాణి ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ...

Byte:MP DK ARUNA

Mahabubnagar, పీటీసీ

ఎంపీ గడ్డం

రాష్ట్రంలో విద్యా, వైద్యం, ఉపాధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఈరోజు మంచిర్యాలలో మీడియా మాట్లాడుతూ.. పెద్దపల్లి మణుగూరు రైల్వే లైన్ కోసం 4 వేల కోట్ల నిధులతో త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎయిర్ ఫోర్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సౌండ్ బైట్ : పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ

పీటీసీ మంచిర్యాల జిల్లా

వాతావరణం

రాష్ట్రంలో  తూర్పు, ఆగ్నేయ దిశల నుండి చలి గాలులు వీస్తున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.   రాష్ట్రంలో రాగల 24 గంటల నుంచి చలి తీవ్రత పెరుగుతుందని ఈ నెల 5 నుంచి 12 వ తేదీ వరకు తీవ్ర చలిగాలులు వీస్తాయని   వెల్లడించింది. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని పేర్కొంది.  ఈరోజు ,  రేపు రాష్ట్రంలో అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.      పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదవుతాయని ప్రకటించింది.

డెస్క్
పవర్ బ్యాంక్
విమానాల్లో పవర్ బ్యాంక్ వినియోగంపై డీజీసీఏ నిషేధాన్ని విధించింది.
లిథియం బ్యాటరీల వల్ల అగ్ని ప్రమాదాలు సంబంధించే అవకాశం ఉందని,
విమానాల ప్రయాణాల్లో పవర్ బ్యాంకుల ద్వారా సెల్ ఫోన్లను ఛార్జింగ్ చేయడం

మంటలకు కారణమయ్యే పరిస్థితి ఉండవచ్చని పేర్కొంది. వీటిని ఓవర్ హెడ్ బిన్ లలో ఉంచినప్పుడు పొగ లేదా మంటలను గుర్తించడం కష్టమవుతుందని ఇది విమాన భద్రతకు ప్రమాదం అని డీజీసీఏ హెచ్చరించింది.

డెస్క్